
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 19 మే 2024



కలకలం రేపిన ఎస్టీపీపీ ఇంజనీర్ ఆత్మహత్య 7లో..

వాగులపై వంతెనలు లేక ప్రజల ఇబ్బందులు 7లో..

మళ్లీ ముంపు భయం

- అసెంబ్లీలో ప్రకటించినా కదలని కరకట్టల పనులు
- ప్రతిపాదనలకే పరిమితమైన రక్షణ గోడలు
- గత ప్రభుత్వంలోనే రూపొందించిన అంచనాలు
- సమీపిస్తున్న వర్షాకాలం



రాళ్లవాగు ప్రవాహంలో నీట మునిగిన ఇళ్లు (ఫైల్)

మంచిర్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో కరకట్టలు కట్టాలనే నిర్ణయం కార్యరూపం దాల్చడం లేదు. రెండు సంవత్సరాలుగా కురిసిన భారీ వర్షాల కారణంగా మంచిర్యాల పట్టణం అధికభాగం వరద నీటిలో మునిగింది. ఆ జ్ఞాపకాలు ప్రజల మెదళ్లలో నుంచి తొలగకముందే మళ్లీ వర్షాకాలం సమీపిస్తోంది.

రాళ్లవాగులో మునిగిన కాలనీలు

రెండు సంవత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. నదిలో చేరే అవకాశం లేక రాళ్ల వాగు, తోళ్లవాగుల్లో వరదనీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి పోటు కమ్మాయి. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, బైపాస్ రోడ్డు, ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో ఇళ్లు మొదటి అంతస్తు వరకు నీట మునిగాయి. తోళ్లవాగు నీరు కూడా నివాస గృహాల దరిదాపుల్లోకి చేరింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు 2022 ఆగస్టు 22, 23 తేదీలలో సర్వే జరిపి నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో పుట్టిన రాళ్లవాగు అటవీ ప్రాంతం గుండా ప్రవహించి జిల్లా కేంద్రానికి చేరుకుంటోంది. ఆర్ఆర్‌నగర్, కార్మెల్ హైస్కూల్, గౌతమినగర్, రెడ్డి కాలనీ, పాత మంచిర్యాల, రాంనగర్, ఎన్టీఆర్ కాలనీల మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. జూలైలో కురిసిన వర్షాల కారణంగా రాళ్లవాగులో 139.20 మీటర్ల ఎత్తున నీరు ప్రవహించినట్లు అధికారులు గుర్తించారు. పాత మంచిర్యాల వంతెన వద్ద 48006.35 క్యూసెక్కుల నీరు వాగు గుండా వెళ్లినట్లు అంచనాకు వచ్చారు. అలాగే తోళ్లవాగుకు పైన ఉన్న చింతల చెరువు నుంచి వరద తాకిడి పెరగడంతో నివాస గృహాల్లోకి నీరు చేరింది.

ప్రతిపాదనలు పంపిన అధికారులు

వరద తాకిడి నుంచి రక్షించేందుకు పట్టణంలోని కార్మెల్ స్కూల్ బ్రిడ్జి నుంచి 5.7 కిలోమీటర్ల పొడవున 140 మీటర్ల ఎత్తుతో ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని, గోదావరి నది ఎడమవైపు ఒడ్డున రాళ్లవాగు కలిచే చోటు నుంచి రైల్వే వంతెన వరకు 2 కిలోమీటర్ల పొడవున కూడా కరకట్ట నిర్మాణం చేపట్టాలని నీటిపారుదల శాఖ ప్రతిపాదించింది. అధికారుల అంచనా మేరకు రూ.234 కోట్ల 86 లక్షల 33 వేలు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో కరకట్టల నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు సుమారు రూ.200 కోట్ల 86 లక్షలు వెచ్చించాల్సి రాగా, కరకట్టల నిర్మాణానికి రూ.20 కోట్ల 21 లక్షల 31వేలు, సీవోటీ ఎక్స్‌వేషన్, పూడిక ఖర్చు రూ.2 కోట్ల 48 లక్షల 43 వేలు, కరకట్ట రివిట్‌మెంట్‌కు రూ.5 కోట్ల 25 లక్షల 51 వేలు, జీఎస్టీ, సీనరేజ్ చార్జీలు, డీఎం ఎఫ్టీ, ఎస్ఎంఎఫ్, తదితరాలకు రూ.6 కోట్ల 91 లక్షల 44 వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. వాగు మధ్య నుంచి ఇరువైపులా 65 ఫీట్ల వెడల్పుతో కరకట్టలు నిర్మించాల్సి ఉన్నందున దాదాపు 43.28 గుంటల పట్టా భూములను సేకరించాల్సి ఉంటుంది. తోళ్ల వాగులో రూ.25 లక్షల అంచనా వ్యయంతో పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా కరకట్టలు నిర్మించాల్సిన అవసరం లేకుండానే పరిస్థితిని చక్కదిద్దవచ్చునని అధికారులు ప్రతిపాదించారు. పెద్ద మొత్తంలో ఖర్చవుతుందనే ఉద్దేశ్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కరకట్టల నిర్మాణాన్ని రద్దు చేసింది.

మంత్రి హామీ ఇచ్చినా

కరకట్టల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కరకట్టల నిర్మాణాన్ని ప్రస్తావించారు. ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా పనుల్లో కదలిక రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని కరకట్టల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, మే 18: ఆర్ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు పేరు పక్కన డాక్టర్ అని రాయకూడదని, ఎలాంటి మందులు ఉండరాదని, ప్రిస్క్రిప్షన్‌పై మందులు రాయరాదని సూచించారు. జాతీయ, స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లాలోని ఆర్ఎంపీలు, పీఎంపీల క్లినిక్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్నారని, ఎవరైనా నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై సైనిక దాడులను ఆపివేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మంచిర్యాల కలెక్టరేట్, మే 18: ఆదివాసీలపై మోదీ ప్రభుత్వం సైనిక దాడులను ఆపివేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టుల సాకుతో ఆదానీ, అంబానీలకు ఖనిజ సంపదను దోచిపెట్టాలనే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ పేరుతో 120 మంది ఆదివాసీ గిరిజన ప్రజలను అత్యంత అమానుషంగా హత్య చేసిందన్నారు. ఎదురు కాల్పుల్లో చంపామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులపై దాడులు, నల్ల చట్టాలను తెరపైకి తీసుకువచ్చిందన్నారు. ఇలాంటి విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మేకల రామన్న, రమేష్, దేవన్న, సారయ్య, సురేందర్, చంద్రమౌళి, కలీం, సయ్యద్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

నస్పూర్, మే 18 : స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను పెంచిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి వాటిని ఏబీసీడీ గ్రూప్‌లుగా వర్గీకరించిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో రిజర్వేషన్లను పెంచి ఏబీసీడీ గ్రూప్‌లుగా వర్గీకరిస్తామని ప్రకటించిందని, ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు మహేందర్, వెంకటేశ్, కొంత రాజు, రాజశేఖర్, రాజేశం పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలను ఆదుకోవాలి




కూలీలను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

దండేపల్లి, మే18 : దండేపల్లిలో ఉపాధిహామీ పనులు చేసి ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాలీ ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య డిమాండ్ చేశారు. మంచిర్యాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను పరామర్శించి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్నారు. తీవ్రగాయాలైన కూలీలందరికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. గాయపడిన వారికి రోజు వారి కూలీ వేతనం, రూ. 5లక్షల నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు వనపర్తి రాకేష్, నాయకులు ఇమ్మిడిశెట్టి శ్రీనివాస్, గోపె రాములు ఉన్నారు.

స్క్రాప్ దుకాణం యజమానిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మే 18 : పట్టణంలోని కాంటా ఏరియాలోని తాపీ సంఘ భవన్ పక్కన గల స్క్రాప్ దుకాణం యజమానిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. స్క్రాప్ దుకాణంతో రోడ్డు వెంట వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని, స్క్రాప్ దుకాణంలోని ఇనుప సామగ్రి రోడ్డుపై పడడంతో అవి బాటసారుల కాళ్లకు గుచ్చుకుంటున్నాయన్నారు. పక్కనే పిల్లల ఆసుపత్రి ఉందని, స్క్రాప్ చెత్తతో దోమలు, ఈగలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. స్క్రాప్ దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించేలా చూడాలని కోరారు.

పాత మంచిర్యాలలో ఊరు పోచమ్మ కొలుపు



పోచమ్మ కొలుపు వద్ద పంబాల పూజారులు

ఏసీసీ, మే 18: పాత మంచిర్యాలలో ఊరు పోచమ్మ కొలుపు, గ్రామ కట్టడి కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఉదయం భూలక్ష్మీ అమ్మవార్లకు పాలపొరక, అలంకరణ పూజలతో ఊరు కట్టడి చేశారు. సాయంత్రం పంబాల పూజారులతో పోచమ్మకథ, పూజలు, కొలుపు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఊరు కట్టడి, వాడ పోచమ్మల వద్ద పూజలు కొనసాగుతాయని రామాలయం, శివాలయం ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

స్కూల్ యూనిఫామ్స్ త్వరగా అందించాలి



కుట్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్, మే 18 : ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలబాలికలకు యూనిఫామ్స్ త్వరగా ఇవ్వాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో ఏర్పాటు చేసిన బాలబాలికల స్కూల్ యూనిఫామ్స్ కుట్టు కేంద్రాన్ని శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలబాలికలకు స్కూల్ యూనిఫామ్స్ డ్వాక్రా గ్రూప్ సభ్యుల ద్వారా కుట్టి అందజేస్తారు. పట్టణంలోని 17 పాఠశాలలు, 1296 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ కేంద్రం ద్వారా ఇవ్వనున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు ఇవ్వాలని సూచించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.రాజు, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, మహిళా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలోని మండల సమాఖ్య కార్యాలయంలో విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టు కేంద్రాన్ని ఎంపీడీవో శశికళ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో యూనిఫాంలు కుట్టించి పాఠశాలలకు అందించాలని సూచించారు. ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీవో రమేష్, ఏపీఎం బుచ్చన్న, కేంద్రం నిర్వాహకులు నాగలక్ష్మీ, సునీత, సరోజ, శ్రీనివాస్, మల్లేశ్వరి, మహేందర్, సమాఖ్య సభ్యులు స్వప్న, శారద, సంగీత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఏసీసీ, మే 18 : మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిరూరల్: మండలంలోని పాలచెట్టు ఏరియాలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, వైర్ల కింద చెట్ల తొలగింపులో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జయకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సారంగపల్లి, శంకర్‌పల్లి, ఆదిల్‌పేట, పొన్నారం, వెంకటాపూర్, మామిడిగట్టులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 18: జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని శనివారం టీబీఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ డీఈవోకు వినతిపత్రం అందించారు. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా కార్పొరేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వీటిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ పాల్గొన్నారు

ఐటీఐల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఏసీసీ, మే 18 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి దఫా అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి గాను ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో అడ్మిషన్‌ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు జూన్ 10లోగా ఆన్‌లైన్‌లో ఐటీఐ.తెలంగాణ.జీవోవి.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎంసెట్‌లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి, మే 18: ఎంసెట్ ఫలితాల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బైపీసీ విభాగంలో 24 మంది పరీక్షలు రాయగా 23 మంది క్వాలిఫై అయ్యారు. జుమిడి ప్రణయ్ 4885 ర్యాంకుతో టాపర్‌గా నిలిచాడు. శివకృష్ణ 7123, నికిత్ 17928, గోమాస అఖిల్ 18578 తర్వాత స్థానాల్లో నిలిచారు. ఎంపీసీ విభాగంలో 38 మంది పరీక్ష రాయగా 37 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో అఖిల్ 17133 ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు కిరణ్, శ్రీరామవర్మ, రమేష్, లక్ష్మీనారాయణ, శోభ, రవీందర్, అనిరుద్, రాజేష్, అర్జున్, లతీఫ్‌లు అభినందించారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, పాల్గొన్న రేషన్ డీలర్లు

మంచిర్యాల కలెక్టరేట్, మే 18: ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణ, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి రేషన్ డీలర్లు, గోదాముల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందిస్తోందని, డీలర్లు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతీ నెల 1వ తేదీ 17వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. దుకాణాల్లో రేషన్‌డీలర్ పేరు, మొబైల్ నెంబర్, స్టాక్ నిల్వలు, పంపిణీ వివరాలతో బోర్డులు నిర్వహించాలని, చౌకధరల దుకాణం చిరునామా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం పంపిణీ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.

షీటీంపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, మే 18 : మైత్రి యోగా ప్రకృతి చికిత్స కేంద్రంలో నిర్వహిస్తున్న క్రియేటివ్ కిడ్స్ సమ్మర్ క్యాంపులో శనివారం షీటీం కానిస్టేబుళ్లు శ్రావణ్‌కుమార్, జ్యోతిలు షీటీంపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై వివరించారు. వారు మాట్లాడుతూ అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇచ్చిన ఆహార పదార్థాలు, చాక్లెట్లు తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా భయభ్రాంతులకు గురి చేస్తే 6303923700 ఫోన్ చేయాలని సూచించారు. క్యాంపు నిర్వాహకులు సుకుమార్, సమీర పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

బెల్లంపల్లి, మే 18 : అధిక దిగుబడుల ఆశ చూపి రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు పెట్టడానికి కూడా వెనకాడమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రాంతంలో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టే విధంగా పోలీసు నిఘా వ్యవస్థను మెరుగు పరిచామన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమార్కులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నకిలీ పత్తి విక్రయదారులను, పాత నేరస్తులను గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ నకిలీ పత్తి విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేయడానికి ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పచ్చిరొట్టతోనే అధిక లాభాలు



పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

భీమారం, మే 18: పచ్చిరొట్ట ఎరువులు వాడడం ద్వారా మంచి లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. శనివారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ 60 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా భూమి సారవంతం కావడంతోపాటు మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ఏవో మార్క్ గ్లాడ్‌స్టన్, పాల్గొన్నారు.

జైపూర్: పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు 60 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కిలోల బ్యాగుకు రూ.1116 అని తెలిపారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను రైతులను వాడాలని సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డుతో సంప్రదించాలన్నారు.

మామిడి కాయల దొంగల అరెస్టు

నెన్నెల, మే 18: మామిడి కాయలు దొంగిలించి వాహనంలో తరలిస్తున్న పది మందిని శుక్రవారం రాత్రి పటుకున్నట్టు నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. బొప్పారం శివారులో ఓ రైతుకు చెందిన తోటను శ్రీనివాసరెడ్డి లీజుకు తీసుకున్నాడని తెలిపారు. రాత్రి పూట పది మంది తోటలో చొరబడి 150 కిలోల కాయలు కోసుకొని టాటాఏస్ వాహనంలో మహారాష్ట్రకు తరలించేందుకు ప్రయత్నించారని చెప్పారు. నెన్నెల టీ రోడ్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి వాహనాన్ని వదిలి పారిపోయేదుకు యత్నించగా వారిని పట్టుకున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా మామిడి కాయలు దొంగిలించి అమ్ముకునేందుకు మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

బ్యాగ్ చోరీ

జన్నారం, మే 18: రేండ్లగూడకుచెందిన ఉపరపుమధుకర్ బ్యాగ్‌ను బస్టాం డ్‌లో చోరీకి గురైనసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మందపల్లి నుంచి జన్నారం బస్టాండ్‌కు వచ్చిమెరూన్ కలర్‌బ్యాగ్‌ను బస్టాండ్‌లోపెట్టి వాటర్‌బాటిల్ కోసం వెళ్లి వచ్చేసరికి బ్యాగ్ కనిపించలేదని మదుకర్‌తెలిపాడు. పాస్‌పోర్టు, దుస్తులు ఉన్నాయని, బ్యాగ్ కనబడితే 9392011305కు సమాచారం అందించాలని కోరాడు.

తేనేటీగల దాడిలో ఆలయ పూజారి మృతి



మృతిచెందిన పూజారి పోశం

రెబ్బెన, ఏప్రిల్ 18: రెబ్బెన మండలంలోని గోలేటిలో తేనేటీగల దాడిలో శనివారం గోలేటి భీమన్న ఆలయ పూజారి పోశం మృతి చెందాడు. ఉదయం పోశం భీమన్న ఆలయ సమీపానికి రాగానే ఒక్కసారిగా తేనేటీగలు దాడి చేయటంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే అక్కడే ఉన్న పలువురి భక్తులపై కూడా తేనేటీగలు దాడి చేశాయి. వీరందరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మందమర్రిటౌన్, మే 18: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జీఎం కార్యాలయం వెళ్లేరోడ్డు వద్ద శనివారంరాత్రి వాహనంఢీకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని వావిలాల గ్రామానికి చెందిన కుంబం రాధమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. రాధమ్మ మందమర్రిలోని కూతురును చూసేందుకు జమ్మికుంట నుంచి మందమర్రికి వచ్చింది. మందమర్రిలో బస్సుదిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓవాహనం ఢీకొనడంతోతలకు బలమైన గాయాలై మృతిచెందింది. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం మంచిర్యాల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై ఇలా ఫిర్యాదు చేయండి

జైపూర్, మే 18: నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు టోల్‌ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. అయితేవాటిపై జిల్లావాసుల్లో చాలామందికి అవగాహనలేదు. సమస్యలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్లసేవలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా చోటుచేసుకుంటున్న సైబర్‌మోసాలనుంచి సత్వరమే బయట పడేందుకు టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచారు. వేధింపులు, హింసలు, సైబర్ మోసాలు, ఇతర అనేక సమస్యలకు సంబంధించి అందుబాటులో ఉన్నటోల్‌ఫ్రీ నెంబర్లపై ప్రజలు అవగాహన పెంచుకునిసేవలను సద్వినియోగం చేసుకుంటే కొంతైనామేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

-సైబర్ నేరాల కట్టడి - 1930

సమాజంలో సైబర్‌నేరాలబారిన పడేవారిసంఖ్యరోజురోజుకు పెరుగుతోంది. నిరక్షరాస్యులే కాకుండా విద్యావంతులు సైతం సైబర్ నేరాల బారిన పడి మోసాలకు గురవుతున్నారు. అయితే బ్యాంకుకు వెళ్లకుండా సత్వరమే ఖాతాలావాదేవీలను కట్టడి చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చు.

-మానసిక సమస్యలు - 14416

మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నారా? ఒత్తిడికి గురయ్యేవారు, వారి కుటుంబీకులు, మిత్రులు 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వండి మీ సమస్యను అర్థం చేసుకుని దాని నుంచి బయట పడేలా నిపుణులు సహకరిస్తారు.

-నిరాదరణకు గురయ్యే వృద్ధులు - 14567

వయోభారంతో బాధపడుతున్న వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారా, కన్న బిడ్డలు తల్లిదండ్రులు ఆదరించకపోతే ఆ సమాచారాన్ని ఎవరైనా టోల్‌ఫ్రీనెంబర్ 14567కు ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందించి కుటుంబీ కులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంకా అవసరమైతే డివిజన్ స్థాయి మెజిస్ట్రేట్ విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తారు.

-వేధింపులకు గురయ్యే మహిళలు - 181

రోడ్డుపై వెళ్తుండగా ఆకతాయిలు వేధించినా, నిత్యం భర్త చేతిలో హిం సకు గురయ్యే మహిళలు టోల్‌ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేస్తే నిమిషాల్లోనే సఖి కేంద్రానికి చెందిన వాహనం వచ్చి బాధితులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తుంది. అవసరం అయితే వసతి, పోలీసుల సేవలు, వైద్యం, న్యాయం అందించేలా సహాయం అందిస్తారు.

-విద్యుత్ సమస్యలు -1912

కరెంటు బిల్లులు, మీటరు కనెక్షన్ మంజూరులో జాప్యం, ఇలా విద్యుత్ సమస్యలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1912 లేదా 1800 4250028కు ఫోన్‌చేస్తేచాలు అధికారులు సమస్యకు పరిష్కారం చూపుతారు.

-బాలల సంరక్షణ - 1098

బడీడు పిల్లలు, బాల కార్మికులుగా పనిచేస్తున్నా, మైనర్లకు వివాహం చేస్తున్నా మీదృష్టికి వస్తేటోల్‌ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వవచ్చు. దీంతోసంబంధిత ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్‌కార్మికశాఖ అధికారులుస్పందించి తక్షణచర్యలు తీసుకుని న్యాయం చేస్తారు.

-గ్యాస్ లీక్ - 1906

ఇంట్లో వంటకు వినియోగించేగ్యాస్ సిలిండర్ లీకవుతున్నట్లు గ్రహిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1906కు సమాచారం అందిస్తే అధికారులు పరిష్కారం చూపుతారు. ఏ కంపెనీ సిలిండర్ అయినా ఇదే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి చెస్‌బోర్డులు అందజేత



రవీందర్‌ను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా

తిర్యాణి, మే 18: గిరిజనసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరానికి మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మేండ్రపు రవీందర్ శనివారం చెస్‌బోర్డులు అందజేశారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా రవీందర్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏటీడీవోలు క్షేత్రయ్య, పురుషోత్తం, ఖమర్ హుస్సేన్, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఆసిఫాబాద్ గిరిజన క్రీడల అధికారిణి మీనారెడ్డి, మంచిర్యాల క్రీడాధికారి కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాస్, విజయశాంతి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీఈటీలు లక్ష్మణ్, మంగపతి, శ్రీనివాస్, సుభాష్, సుమలత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతానికి కృషి చేయాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18: విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతానికి సభ్యులంతా కలిసికట్టుగా కృషిచేయాలని సంఘం జిల్లా అధ్య క్షుడు లక్ష్మణాచారి తెలిపారు. శనివారం కాగజ్‌నగర్‌లో నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులకు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అంతా కలిసికట్టుగా ఉండి హక్కుల సాధన కోసం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, కాగజ్‌నగర్ అధ్యక్షుడు బొజ్జపద్మాకరచారి, ఉపాధ్యక్షులు పోలోజు శ్రీనివాస్, ముత్తులింగం, షణ్ముకచారి, యుఎన్‌చారితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణ, మండలంలో పది పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విశ్వబ్రాహ్మణ సంఘ విద్యార్థులను ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు.

రైసుమిల్లులను పరిశీలించిన ఆర్డీవో



రైసుమిల్లర్లకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో రాములు

జన్నారం, మే 18: మండలంలోని పలు రైసుమిల్లులను శనివారం మంచిర్యాల ఆర్డీవో రాములు పరిశీలించి రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. రైసుమిల్లుల యజమానులకు సూచనలు చేశారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని గడువులోగా అందించాలని సూచించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకుని లారీలను తిరిగి పంపించాలన్నారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు

జైపూర్, మే 18 : రైతులకు నష్టం చేసే రైసుమిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత కార్మికసంఘం సమాఖ్య రాష్ట్ర నాయకుడు పోచమల్లు పేర్కొన్నారు. శనివారం పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలు సరిపోవని, క్వింటాల్ ధాన్యానికి రూ.3500 ప్రకటించి, బోనస్ రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ, బీమా, సబ్సిడీ ఎరువులు, రైతులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాములు, రాయమల్లు, రత్నకుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



తాండూరులో పూజలు చేస్తున్న మహిళలు

తాండూర్, మే 18: మండల కేంద్రంలో శనివారం కన్యకాపరమేశ్వరి జయంతిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పూజలు, అభిషేకాలు, పారాయణం, కుంకుమ పూజలను ఆలయ అర్చకులు వినాయకరావు మాధవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కేశెట్టి సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, మధుసూదన్, సురేష్, రమేష్, లచ్చయ్య, బాపూజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరామాంజనేయ ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరీ జయంతిని వైభవంగా నిర్వహించారు. బస్టాండ్ నుంచి రామాలయం వరకు చిత్రపటంతో ఊరేగించారు. సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

కలకలం రేపిన ఎస్టీపీపీ ఇంజనీర్ ఆత్మహత్య

జైపూర్, మే 18 : జైపూర్‌లోని సింగరేణి థర్మల్ ప్లాంటులో పనిచేసే బూరుగడ్డ కిరీటి(37) డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ శుక్రవారం ఆత్మహత్య చేసుకోవడం సంస్థలో కలకలం రేపింది. మృతుడు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్(ఓఅండ్ఎం) విభాగంలో పనిచేస్తూ మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నాడు. ఇటీవల కొందరు అధికారుల తీరుతో ఎస్టీపీపీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంస్థకు చెందిన సామగ్రి విషయంలో అధికారులు అవినీతికి పాల్పడుతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇటీవల స్టోర్స్‌లో సామగ్రి మాయమైన విషయంలో విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వారం క్రితం కొందరు సిబ్బందిని పిలిచి వివరాలు సేకరించారు. తమపై ఎక్కడ చర్యలుంటాయోనని కొందరు అధికారులు ఆందోళన చెంది సదరు తప్పును కిరిటీపై నెట్టే ప్రయత్నం చేశారు. తప్పు ఒప్పుకోవాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో త్వరలో విజిలెన్స్ అధికారులు నోటీసులు ఇస్తామని చెప్పడం, తప్పు ఒప్పుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో ఆందోళన చెందిన కిరీటి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

సూసైడ్ నోట్‌లో ఉన్నదెవరు ?

కిరీటి రాసిన సూసైడ్ నోట్‌లో ఎస్టీపీపీకి చెందిన కొందరు ఉన్నతాధికారుల పేర్లు ఉన్నట్లు తెలిసింది. నోట్ పోలీసుల చేతికి వెళ్లినా వారు ఇంకా పేర్లు బయట పెట్టడం లేదు. అధికారులు పోలీసులను సైతం మేనేజ్ చేసి, తమ పేర్లు బయటకు రాకుండా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అధికారుల సంఘం స్పందించదా ?

సంస్థ విషయాలపరంగా యువ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకుంటే సింగరేణి అధికారుల సంఘం స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రకటనలు, ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప.. మృతుడి కుటుంబానికి బాసటగా నిలిచే ప్రయత్నం చేయడం లేదు. సంఘం కూడా సంస్థ ఒత్తిడికి తలొగ్గిందా అని పలువురు అధికారులు ప్రశ్నిస్తున్నారు.



మృతుడు కిరీటి(ఫైల్)

చిత్తవుతున్న ఉద్యోగులు

సంస్థ లక్ష్యాల కోసం అధిక పనిభారం మోపుతుండడంతో సింగరేణి ఉద్యోగులు చిత్తవుతున్నారు. కేవలం సంస్థ లాభం తప్ప తమ గురించి పట్టించుకోవడం లేదని అధికారులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ యాజమాన్యానికి లక్ష్యాలు, లాభాలే తప్ప ఇంకేమీ కనిపించడం లేదని, దీనివల్ల తీవ్రమైన పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బం దులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి అసలు దోషులను శిక్షించి, తమకు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు.

పని ఒత్తిడి, విజిలెన్స్ తనిఖీలతో ఇబ్బందులు

మందమర్రిటౌన్: సింగరేణిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు పని ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారని, ఇతరులు రాసే ఉత్తరాలతో విజి లెన్స్ అధికారులు విచారణ చేపడుతుంటే మానసిక క్షోభకు గురవుతు న్నామని, వీటిని అరికట్టాలని సింగరేణి అధికారులు సంఘం నాయకులు శనివారం ఎస్‌వోటూ జీఎం రాఘవరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ఏరియా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఈ నెల 17న ఎస్టీపీపీలో పనిచేస్తున్న ఎస్ఈ కిరిటీ పని ఒత్తిడితో పాటు విజిలెన్స్ అధికారుల ఎంక్వైరీ వల్ల చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. బయటి వ్యక్తులు రాసే ఉత్తరాలను పరిగణలోకి తీసు కుని విచారణ పేరిట విజిలెన్స్ వారు ఇబ్బందులు పెట్టడం సరైంది కాద న్నారు. నిరంతరం సింగరేణి అధికారులు, ఉద్యోగులు శ్రమించి 70 మిలి యన్ టన్నుల లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. విజిలెన్స్ అధికా రులు ముందుగా ఉద్యోగ విధి విధానాలతో పాటు అధికారుల గురించి తెలుసుకోవాలన్నారు. చాలా మంది ఇప్పటికే విజిలెన్స్ వేధింపులతో మాన సిక క్షోభకు గురవుతున్నారన్నారు. అధికారి కిరిటీ ఆత్మహత్య దీనికి ఒక ఉదాహరణ అని తెలిపారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఫైడీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌వోటూ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న సింగరేణి అధికారుల సంఘం నాయకులు

వాగులపై వంతెనలు లేక ప్రజల ఇబ్బందులు



అందుగులపేట గ్రామంలో వాగుపై కూలిపోయిన వంతెన (ఫైల్)

మందమర్రిరూరల్, మే 18: మండలంలోని వాగులపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అందుగులపేట శివారు పెద్దవాగుపై ఉన్న వంతెన గతేడాది వర్షాలకు కొట్టుకుపోవడంతో ప్రస్తుతం దాని పక్కనే వాగులో పైపులు వేసి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. యేటా వర్షాకాలంలో ప్రజలు వాగులు దాటలేక ఇబ్బందులు పడుతున్నారు. అందుగులపేట గ్రామంలోని 90 శాతం రైతుల పొలాలు వాగు అవతల ఉండడంతో వాగు దాటడానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో సోలార్ కంపెనీ వారు వాగుపై బ్రిడ్జి నిర్మించగా వర్షాలకు కొట్టుకుపోయింది. అలాగే ఊరు మందమర్రి నుంచి మామిడిగూడెం మధ్యలో ఉన్న ఊరు మందమర్రి వాగు దాటాల్సి వస్తోంది. వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కేకే 5 గని నుంచి శంకర్‌పల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పాలవాగుపై వంతెన లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు వాగులపై బ్రిడ్జిలు నిర్మిస్తామని చెబుతున్నప్పటికీ అది కార్యరూపం దాల్చడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన లేక ఇబ్బందులు పడుతున్నాం

-సందీప్, అందుగులపేట

అందుగులపేట వాగుపై వంతెన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో దాటలేక పోతున్నాం. గతంలో పశువులు వాగులో కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది ఒక మహిళ వాగు దాటుతూ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. ప్రస్తుతం తాత్కాలిక వంతెన ఉన్నా అది వర్షాలకు కొట్టుకుపోయే అవకాశం ఉంది. వెంటనే వాగుపై వంతెన నిర్మించాలి.



పైపులు వేసి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏసీసీ, మే 18 : మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో పనిచేస్తున్న అశోక్ ఈ నెల 14న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సిరికొండ అశోక్ (24) అనే యువకుడు తండ్రి రాజయ్యతో కలిసి పద్మనాయక ఫంక్షన్ హాలులో పని చేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. అవివాహితుడైన అశోక్ కొంత కాలంగా మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడ్డాడు. ఆరోగ్యం బాగాలేదని మనస్తాపానికి గురై ఈ నెల 14న యాసిడ్ తాగగా తండ్రి రాజయ్య గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

నెన్నెల, మే 18: మైలారం గ్రామానికి చెందిన యువతి (18) నాలుగు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈ నెల 14న బెల్లంపల్లికి దుస్తులు కొనేందుకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. యువతి తండ్రి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్యాలెండర్ల విడుదల

హాజీపూర్, మే 18: హాజీపూర్ మండలం నంనూర్‌లో దుబ్బుల కొలుపు కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు జునగిరి దుర్గయ్య దుబ్బుల కొలుపు సంఘం క్యాలెండర్లను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు జునగిరి నారాయణ, రాజ్‌కుమార్, రాజ్‌కుమార్ కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి



కాగజ్‌నగర్‌లో అమ్మవారి విగ్రహానికి బంగారు చీరతో అలంకరణ

బెజ్జూరు, మే 18: మండలకేంద్రంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వాసవీమాత చిత్రపటానికి అభిషేకం, కుంకుమార్చన పూజ తదితర కార్యక్రమాలను నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, సతీష్, సంతోష్, మహేష్, శ్యామల కిరణ్, రమేష్, వెంకటరమణ, అనిల్, స్వప్నిల్, బాలరాజు పాల్గొన్నారు.

కౌటాల: మండలకేంద్రంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. నైవేద్యాలను సమర్పించారు.

పెంచికలపేట: మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ వాసవీమాత ఆలయంలో శనివారం వాసవీమాత జయంతి సందర్భంగా అమ్మవారికి బంగారు వస్త్రాలంకరణ చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పూజలు నిర్వహించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అమ్మవారి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కౌటాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కాగజ్‌నగర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వాంకిడి, మే 18: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజాము తమకు అందిన సమాచారంమేరకు వ్యాన్(టీఎస్02యూఏ1517)ను సరండి టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని పట్టుకుని తనిఖీ చేయగా 200ప్లాస్టిక్ బస్తాలలో నింపి మహారాష్ట్రకు తరలిస్తున్న సుమారు 100 క్వింటాళ బియ్యం బ్యాగులను లభించినట్లు తెలిపారు. రవాణా చేస్తున్న నిందితులపై 6(ఎ) కేసు నమోదుచేసి బియ్యాన్ని ఎం ఎల్ఎస్ పాయింట్‌కు తరలించి వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

సిర్పూర్(టి), మే 18: మండలంలోని చీలపల్లి, మేడిపల్లి గ్రామపంచాయతీ నర్సరీలను శనివారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. వందశాతం మొక్కలు ఉండాలని, నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు పెంచాలన్నారు. మొక్కలకు అవసరమం మేరకు నీరు అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, రాహుల్, ఎఫ్ఏ భీంరావు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని ఇట్యాల, బోర్లకుంట, కోత్మీర్, బీబ్రాగ్రామాల్లో హరితహారం నర్సరీలను శనివారం ఎంపీడీవో రాజేందర్ పరిశీలించారు. నర్సరీలో మొక్కలు పెంచడానికి ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. కలుపుమొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఉపాధిహామీ పనులకు కూలీలు ఉదయం వెళ్లాలని సూచించారు. ఆయనవెంట కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు

సిర్పూర్(టి), మే 18: మండలకేంద్రంలోని సయ్యద్ తాలీబ్ అలీషాబాబా దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు దర్గాలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించి గంధపుచెక్క, చాదర్‌ను సమర్పించారు. కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూరు, మహారాష్ట్రలోని రాజురా తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గావద్ద మిఠాయి, పూలు, ఆట వస్తువులు, గృహోపకరణాల దుకాణాలు వెలిశాయి. ఉర్సుఉత్సవాల సందర్భంగా రాత్రి కవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకువచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉర్సు ఉత్సవానికి తరలివచ్చిన భక్తులు

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18: కాగజ్‌నగర్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ముగిశాయి. అభిషేకము, వివిధ పూజలు, మూల మంత్రం హోమ, పూర్ణ హరాతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హారతి, మహాప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ సమాధి వద్ద దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణాచారి, కాగజ్‌నగర్ అధ్యక్షుడు బొజ్జపద్మాకరచారి, ఉపాధ్యక్షులు పోలోజు శ్రీనివాస్, ముత్తులింగం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో హారతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

బెజ్జూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన కార్యక్రమంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహేంద్ర స్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. తీర్థప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, చాకటి, బ్రహ్మయ్య, పి బ్రహ్మయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, అశోక్, రమేష్, శ్రీనివాస్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

రెబ్బెన, ఏప్రిల్ 18 : ఇందిరానగర్ బస్టాండు వద్ద శనివారం అంబలి పంపిణీ కార్యక్రామన్ని దేవర వినోద్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు, కూలీలకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నిర్వహకులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

రెబ్బెన, ఏప్రిల్ 18 : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారిని మంజుల తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకావాలని కోరారు. అలాగే 30కిలోల విత్తనాల బస్తాకు రూ.1116ధర ఉంటుందన్నారు.

యోగా క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, ఏప్రిల్ 18 : గోలేటి సింగరేణి పాఠశాల ఆవరణలో యువజన క్రీడాశాఖ యోగా కోచ్ కేసరి అలేఖ్య ఆధ్వర్యంలో సమ్మర్ యోగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి అంజనేయులుగౌడ్ తెలిపారు. ఈ యోగా క్యాంపును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సింగరేణి పాఠశాల ఆవరణలో సాయంత్రం 5.30నుంచి 6.30గంటల వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ కొలిపాక కిరణ్, ఉపాధ్యక్షుడు పీఈటీ భాస్కర్ కోశాధికారి జగన్నాథ ఓదెలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

అభివృద్ధి కుంటుపడుతోంది

- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- గుత్తేదారులు, దళారులతో అధికారుల మిలఖాత్
- ఉద్యోగాలు అమ్ముకుంటున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు
- స్థానిక నిరుద్యోగులకు అన్యాయం
- అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- వాడివేడిగా జడ్పీ పాలకవర్గ చివరి సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ , కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్ రూరల్, మే 18: జిల్లాలోని పలుశాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు మంజూరైన పనులను చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే అభివృద్ధి కుంటుపడుతోందని, తాము ప్రజల్లోకి వెళ్లి సమాధానం చెప్పలేకపోతున్నట్లు సభ్యులు మండిపడ్డారు. శనివారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబుతోపాటు జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

జిల్లా పరిషత్ పాలకవర్గం చివరి సమావేశం కావడంతో అధికారుల పనితీరును సభ్యులు ఎండగట్టారు. ఆయాశాఖల అధికారుల మధ్య సమన్వయలోపం.. నిర్లక్ష్యం కారణంగానే జిల్లాలో ఐదు సంవత్సరాల నుంచి అభివృద్ధి పనులు ముందుకు సాగలేదని ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా మంజూరైన రోడ్ల నిర్మాణంలో పురోగతి లేదన్నారు. పనిచేయని గుత్తేదారులను బ్లాక్‌లిస్టులో పెట్టాలని పదేపదే చెబుతున్నప్పటికీ అధికారులు వారికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు అటవీశాఖ అధికారులు అనుమతుల పేరుతో పనులను అడ్డుకుంటున్నారని పోడుభూముల విషయంలో దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశానికి డీఎఫ్‌వో ఎందుకు హాజరు కాలేదని కిందిస్థాయి ఉద్యోగులకు సమస్యలను ఎలా వెల్లబుచ్చేదని తాము ఎమ్మెల్యేలమా? లేదా వార్డు మెంబర్లమా? అంటూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అటవీశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆసిఫాబాద్ ఎఫ్ఆర్‌వో అప్పలకొండను సరెండర్ చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మితోపాటు సభ్యులు డిమాండ్ చేశారు.

జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు ఉద్యోగాలను అమ్ముకుంటున్నారన్నారు. ఒక్కో ఉద్యోగానికి రూ. లక్షల్లో వసూలు చేస్తూ పొరుగు జిల్లాల వారిని నియమిస్తూ ఇక్కడి నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై ప్రత్యేకదృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు మాఫీయాగా ఏర్పడి మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులతో కుమ్మక్కై రోగుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారన్నారు. ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోకి అనుమతించకూడదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. జిల్లాలో అధికారుల ప్రోత్సాహంతో ఇసుక మాఫియా యథేచ్ఛగా నడుస్తున్నదని ప్రతిరోజు వందలారీలకు పైగా ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆదిలాబాద్‌కు తరలి వెలుతోందన్నారు. ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి రాయల్టీ చెల్లించాకే ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చేలా చూడాలని తద్వారా జిల్లాకు ఆదాయం సమకూరుతుందన్నారు. జిల్లాలో విత్తనాలు ఎరువులు కొరత లేకుండా చుడాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని వరికొనుగోలు కేంద్రాలలో తప్ప, తాలు, తేమ పేరుతో రైతులకు నష్టం కలిగిస్తున్నారని రైతులకు ఇబ్బందులు లేకుం డా కల్లాల్లో ఉన్న చివరి ధాన్యం గింజను వర్షాలు రాకముందే కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో బోర్‌వెల్ నిర్మాణ పనులకు మంజూరు వచ్చినా అవి ప్రారంభించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వభూములు ఆక్రమణకు గురవుతున్నాయని జన్కాపూర్, రాజంపేట కాలనీలలో కొంతమంది ప్రభుత్వ భూములను కబ్జా చేసుకొని శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. జన్కాపూర్ థియేటర్ సమీపంలోని విలువైన ప్రభుత్వ భూమిలో ఓవ్యక్తి నాలుగు ప్లాట్లను కబ్జా చేసుకున్నాడని వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు, సభ్యులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

సమస్యలపై నిలదీత..

ఆసిఫాబాద్ పట్టణం నుంచి ఫోర్‌లైన్ రోడ్డు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అధికారులను ప్రశ్నించారు. తిర్యాణి మండలంలో పోడు భూములకు పట్టాలున్నప్పటికీ అటవీ అధికారులు సాగు చేసుకోనివ్వడంలేదన్నారు. రోడ్డు మరమ్మతు పనులకు అటవీ అనుమతులు లేవంటూ అధికారులు పనులు అడ్డుకుంటున్నారని దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తిర్యాణి జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. కెరమెరి మండలంలోని అనార్‌పెల్లి, లక్మాపూర్ వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. వర్షాకాలంలో ఆయాగ్రామాల ప్రజలు వాగు దాటలంటే ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని కెరమెరి ఎంపీపీ, జడ్పీటీసీలు తుకారాం, ద్రుపదబాయిలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

రెబ్బెన మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ఎందుకు ప్రారంభించడంలేదని ఓట్ల కోసం గ్రామాలకు వెలితే ప్రజలు తిడుతున్నారని ఎంపీపీ సౌందర్య వాపోయారు. రెబ్బెన మండలం తుంగెడలో 1986లో పట్టాలిచ్చిన భూములలో సాగు చేస్తుంటే అటవీ అధికారులు అడ్డుకొని 13మందిపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజస మన్నారు. కొన్ని కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల ప్యాకెట్లను డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నా రని, మహారాష్ట్ర రైతులకు విక్రయించ డంతోనే ఈ కొరత ఏర్పడుతోందని అధికారులు దృష్టిసారించి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాంకిడి జడ్పీటీసీ అజయ్ పేర్కొన్నారు. ఆసిఫాబాద్ మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించలేదని ఎప్పుడు ప్రారంభిస్తారని ఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్ అధికారులను నిలదీశారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి..
కోనేరు కృష్ణారావు, ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్



జిల్లాలో టెండర్ల ద్వారా పనులను చేజిక్కించుకొని సంవత్సరాల పాటు ఆ పనులను ప్రారంభించని, పూర్తిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఇన్‌చార్జి జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంజూరైన పనులను ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలన్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోందన్నారు. పోడు భూముల విషయంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగులు పైస్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా..
కలెక్టర్ వెంకటేష్ దోత్రే



జిల్లాలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకునేదిలేదు..
పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే సిర్పూర్



వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కల్లాల్లో ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. తప్ప, తాలు, తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఉరుకునేది లేదన్నారు. అవసరమైతే రైతులందరితో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. వర్షాలు రాకముందే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఔట్‌సోర్సింగ్ మాఫియా కొనసాగుతోందన్నారు. చిన్నచిన్న ఉద్యోగాలు కూడా జిల్లావాసులకు రావడంలేదు. జిల్లాలో ఒకరిద్దరు అధికారుల తీరువల్ల కనీసం బోర్‌వెల్ కూడా మంజూరు చేయలేని పరిస్థితుల్లో ఉన్నాం. అధికారులు తమ తీరును మార్చుకోవాలన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి..
కోవలక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్



ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న భూ కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వభూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలో అధికారుల అండదండలతో ఇసుక అక్రమరవాణా కొనసాగుతున్నది. దీనిని అరి కట్టాలి. నిత్యం వందల సంఖ్యలో లారీల ద్వారా ఆదిలాబాద్‌కు ఇసుక ను తరలిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. గతంలో పనులు చేపట్టిన గుత్తేదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

హత్యకేసులో నిందితుల అరెస్టు

ఆసిఫాబాద్ రూరల్, మే 18: భర్తను హత్యకేసిన చునార్కర్ కళావతితోపాటు ఆమె ప్రియుడు అక్కపెల్లి రవీందర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామానికి చెందిన చునార్కర్ రవీందర్ అనేవ్యక్తితో కళావతికి 16 సంవత్సరాలక్రితం పెళ్లి జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక సంవత్సరంనుంచి కళావతి అదే గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో ఆమెను పుట్టింటికి పంపించాడు. పెద్ద మనుషుల చొరవతో భర్త రవీందర్‌ను సముదాయించి మళ్లీ కాపురానికి పంపించారు. అయినా కళావతిలో మార్పు రాక పోవడంతోపాటు అక్కపల్లి రవీందర్‌తో వివాహేత సంబంధం కొనసాగించింది. ఈనెల16న రాత్రి చునార్కర్ రవీందర్, పిల్లలు నిద్రిస్తున్నట్లు తెలుసుకున్న అక్కపల్లి రవీందర్ వారి ఇంటికి వచ్చాడు. ఇంటివెనకాల వైపుగల రూంలో అలికిడి కావడంతో చునార్కర్ రవీందర్ లేచి అటువైపు వెళ్లగా కళా వతి, అక్కపల్లి రవీందర్ కలిసి ఉండడాన్ని చూశాడు. ఇక నేను చచ్చిపోతా నేను బతకను అని ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందు తాగాడు. అతను(చునార్కర్ రవీందర్) బతికిఉంటే విషయం ఎవరికైనా తెలుస్తుందే మోనని ఎట్లా అయినా అతన్ని చంపాలని కళావతి, అక్కపల్లి రవీందర్ నిర్ణయించుకొన్నారు. వెంటనే నైలాన్ తాడుతో ఉరిబిగించి చంపారు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నట్లు మృతదేహాన్ని దులానానికి వేలాడ దీసినట్లు వెల్లడించారు. శనివారం రహపల్లి గ్రామంలో కళావతి, అక్కపల్లి రవీందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కోసం కోర్టుకు పంపినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట బందోబస్తు

ఆసిఫాబాద్, మే 18: జూన్9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీ ఎస్‌సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షనేపథ్యంలో హైదరాబాద్ నుంచి జిల్లాకలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్9న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో ఏడు కేంద్రాలు, ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో ఆరుకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 2783మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పరీక్షాకేంద్రాల్లో 1512మంది, ఆసిఫాబాద్ పట్టణంలోని పరీక్షాకేంద్రంలో 1271మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షాకేంద్రల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాల ఏర్పాట్లు ఉండేలా చూస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144సెక్షన్ విధించనున్నట్లు చెప్పారు. పరీక్షాకేంద్రానికి మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ సదయ్య, గ్రూప్-1 నిర్వహణ ఆసిఫాబాద్ రీజనల్ సమన్వయకర్త డి లక్ష్మీనర్సింహం తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు, ఎస్పీ తదితరులు

ఓవర్ పాస్ వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన

సిర్పూర్(టి), మే 18: సిర్పూర్(టి) రేంజ్ పరిధిలో అటవీప్రాంతం గుండా వెళ్తున్న రైల్వేమార్గంలో వన్య ప్రాణుల సౌకర్యార్థం ఓవర్‌పాస్ వంతెన నిర్మాణానికి అనువైన స్థలాన్ని శనివారం అటవీ, రైల్వే శాఖాధికారులు పరిశీలించారు. ఎఫ్‌డీటీపీ శాంతారాం, జిల్లాఅటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎఫ్ఆర్వో పూర్ణచందర్ రైల్వే అధికారులు ద్రోణాచార్య, గంట శ్రీనివాస్‌తో కలిసి దట్టమైన అటవీప్రాంతంలో వన్యప్రాణులకు, పులులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా దాటేందుకు ఓవర్ పాస్ వంతెన స్థలపరిశీలన జరిపారు. కార్యక్రమంలో అటవీఅధికారులు మోహన్, షాహిద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన జరుపుతున్న అటవీ, రైల్వే అధికారులు

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు

● ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్ రూరల్,మే 18: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆసిఫాబాద్ ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్‌నాయకుడు శ్యాంనాయక్, బాలేష్‌గౌడ్, బీసీ సంఘం నాయకుడు రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కేశవరావు, వ్యాపారులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును పరిశీలించిన పీవో



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్, మే 18: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజనక్రీడా పాఠశా లలో ఈనెల 16నుంచి 31వరకు నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్స్‌ను శనివారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా సందర్శించి క్రీడాకారులకు క్రీడాదుస్తులు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కొద్దిసేపు చెస్ ఆడి క్రీడా మైదానాన్ని పరిశీలించి పాఠశాలల ప్రారంభం వరకు క్రీడా పాఠశాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చాలని డిప్యూటీ ఈఈ నిరంజన్‌కు సూచించారు. కుమరం భీం, మంచిర్యాల జిల్లాల్లో ఆశ్రమ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన 60మంది బాలురను, 60మంది బాలికలను ఇప్పటికే ఎంపిక చేశామని గిరిజన క్రీడలఅధికారి మీనారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవోలు క్షేత్రయ్య, పురుషోత్తం, ఖమర్‌హుస్సేన్, జీసీడీవో శకుంతల, మంచిర్యాల క్రీడల అధికారి జీవరత్నం, ప్రధానోపాధ్యాయుడు, కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాస్, విజయశాంతి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీఈటీలు లక్ష్మణ్, మంగపతి, శ్రీనివాస్, సుభాష్, రవీందర్, సుమలత, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

జైనూరు, మే 18: మండలంలో శనివారం ఆరవరోజు బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపారసముదాయాలు బంద్‌పాటించాయి. కార్యాలయాలు మామూలుగా పనిచేశాయి. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అయ్యప్ప ఆలయ కమిటీ

సిర్పూర్(టి), మే 18: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా భిక్షపతి, అధ్యక్షుడుగా తులసీదాస్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధానకార్యదర్శిగా తిరుపతి, కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా సాయి, ప్రచార కార్యదర్శిగా హరికృష్ణ, కార్యదర్శులుగా రాజేందర్, తదితరులను ఎన్నుకున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి: సీఎంవోఏఐ

శ్రీరాంపూర్, మే 18: ఎస్‌టీపీపీకి చెందిన యువఇంజనీర్ బూరుగడ్డ కిరీటి ఆత్మహత్య చేసుకున్న విషయంలో విచారణజరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎంవోఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జి జీఎం పి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, అధికమైన పనిఒత్తిడి, విజిలెన్స్ అధికారుల విచారణతో ఆందోళన చెందిన కిరీటి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ సర్వతోముఖాభివృద్ధికి తాము అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. అయినా తమ ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, దీర్ఘకాలంగా విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని విజ్ఞప్తిచేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏరియా ఉపాధ్యక్షుడు కె కిరణ్‌కుమార్, సంయుక్తకార్యదర్శి గౌస్‌పాషా, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, ఇతరవిభాగాల అధిపతులు, గనులు, విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఏరియాలో అంతర్గత రోడ్లు నిర్మించాలి

మందమర్రిటౌన్, మే 18: ఏరియాలో అంతర్గత బీటీరోడ్లు నిర్మించాలని మందమర్రి ఏరియా గుర్తింపుసంఘం బ్రాంచ్‌కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన ఏరియా వర్క్‌షాపులో కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వేసిన బీటీరోడ్లు కంకరతేలి నడవడానికి కూడా వీలులేకుండా మారాయన్నారు. గనులవారీగా కార్మికుల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామ న్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్న దృష్ట్యా కాలనీల్లో రోడ్లనిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టండి



సీఎండీ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

శ్రీరాంపూర్, మే 18: సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న యువకార్మికులు తమ చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా లక్షలాది రూపాయలు పోసి ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారన్నారు. గతంలో సింగరేణి పాఠశాలల్లో సీటు లభించడం గగనంగా ఉండేదన్నారు. ఎంతోఉన్నత ప్రమాణాలు పాటించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహణ సక్రమంగా లేక కునారిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సందర్భంలో కార్పొరేట్ స్కూల్స్‌ను తలదన్నేలా సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటుచేయాలని, తద్వారా చిన్నారులకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలోశ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, ఎస్‌టీపీపీ ప్రధానకార్యదర్శి దుస్సభాస్కర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోడకుంట శ్రీధర్, జాయింట్ కార్యదర్శి పెద్దిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఊరుకోం

శ్రీరాంపూర్, మే 18: ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు హెచ్చరించారు. శనివారం ఎస్ఆర్పీ1 గనిని యూనియన్ నాయకులు సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు, ఐఎన్‌టీయూసీకి పెరుగుతున్న ఆదరణను చూసి కొందరు ఓర్వలేకపోతున్నారన్నారు. అటువంటి వారిపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదుచేసి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. పనిస్థలాల్లో వెంటిలేషన్ సౌకర్యం కల్పించాలని, టూల్‌బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మ్యాన్‌రైడింగ్‌ను నిర్ణీత సమయంకంటే పదినిమిషాల ముందు నడిపించాలని, క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, రెస్ట్‌హాల్, లాకర్‌ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేనశ్యాం, మైనింగ్‌స్టాఫ్ సింగరేణి ఇన్‌చార్జి తిరుపతిరాజు, కేంద్ర ఉపకార్యదర్శి ల్యాగలశ్రీనివాస్, కార్యదర్శులు కాల్వశ్రీనివాస్, తోకల వెంకటస్వామి, జీవన్‌రావు, పి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి మద్దెల వెంకటేష్ పాల్గొన్నారు.